ప్రజాశక్తి
సోమవారం 12 ఆగస్టు, 2024
శ్రీకాకుళం



గురుకులంలో మిగులు సీట్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పెద్దపాడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం (బాలికలు)లో మిగులు సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌సి కేటగిరీలో 5వ తరగతిలో 18 సీట్లు, 6వ తరగతిలో నాలుగు, 7, 8, 9 తరగతుల్లో ఒకటి చొప్పున, ఎస్‌టి కేటగిరీలో ఒక సీటు ఖాళీగా ఉందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎస్‌సి కేటగిరీలో 12, ఎస్‌టి కేటగిరీలో 1, బిసి కేటగిరీలో 1, ఒసి కేటగిరీలో ఒకటి ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సీట్లు కావాల్సిన విద్యార్థినులు ఈనెల 13న ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో గురుకులంలో హాజరు కావాలని సూచించారు. సీట్లకు మించి అధికంగా విద్యార్థులు హాజరైతే పరీక్ష విధానాన్ని బట్టి సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

‘మడ్డువలస’ పూర్తయ్యేదెన్నడు?

- ఏడాది కాలంగా ఆగిన పనులు
- ఐదు శాతం పనులు చేసి నిలిపేసిన కొత్త నిర్మాణ సంస్థ
- బిల్లులు పెండింగే ప్రధాన కారణం
- వచ్చే ఏడాది మార్చి వరకు మరోసారి గడువు పెంపు

మడ్డువలస రెండో దశ పనులకు అడుగడుగునా ఆటంకాలు ఏర్పడుతున్నాయి. రిజర్వాయర్ పనులు ప్రారంభించి 15 ఏళ్లు కావస్తున్నా, ఏదోరకమైన ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి. తొలుత పనులు ప్రారంభించిన హైదరాబాద్‌కు చెందిన పిజెఆర్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ 78 శాతం పనులు చేసిన తర్వాత తప్పకుంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2022లో హైదరాబాద్‌కు చెందిన బిఎన్‌బి ఇన్‌ఫ్రా ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి మిగిలిన పనులను అప్పగించింది. ఒప్పందం ప్రకారం ఈ ఏడాది మేలోగా పనులు పూర్తి కావాల్సి ఉంది. కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులను నిలిపేసినట్లు తెలుస్తోంది. దీంతోపాటు రైతుల నుంచి సేకరించిన భూములకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఏడాది కాలంగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



లావేరు మండలం కొత్తకొంకాం వద్ద తవ్వి వదిలేసిన కాలువ

మడ్డువలస జలాశయ రెండో దశ పథకాన్ని నిర్మించాలని 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 6, 2009లో రూ.57.87 కోట్లకు పరిపాలనా ఆమోదం కూడా తెలిపింది. జి.సిగడాం, పొందూరు, లావేరు, ఎచ్చెర్ల, మండలాల్లోని 24,954 ఎకరాలకు సాగునీందించాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. దీంతో మొత్తం 21 గ్రామాలకు తాగునీరు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. పథకం నిర్మాణ బాధ్యతలను విశాఖపట్నానికి చెందిన పి.జె.ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ టెండర్లలో రూ.47.3933 కోట్లకు దక్కించుకుంది. మార్చి 2, 2009న ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం పనిని 24 నెలల కాలంలో పూర్తి చేయాల్సి ఉంది. అంటే మార్చి 2, 2011 నాటికే పనులు పూర్తయి రైతులకు సాగునీరు అందించాల్సి ఉంది. ఒప్పంద కాలపరిమితులు పొడిగిస్తూ ప్రభుత్వం వరుసగా ఆరు పర్యాయాలు అవకాశమిచ్చింది. చివరి సారిగా కాలపరిమితిని జూన్ 30, 2018 వరకు పొడిగించింది. అధికారిక లెక్కల ప్రకారం 78.36 శాతం పనులు పూర్తయ్యాయి. మరో 21.64 శాతం పనులు మిగిలి ఉన్నాయి. ఒప్పందం విలువ రూ.47.393 కోట్లలో రూ.37.14 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం సంబంధిత నిర్మాణ సంస్థ పనులు నిలుపుదల చేసింది. దీంతో ప్రభుత్వం జూలై 8, 2020లో సంబంధిత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని ముగించింది.

కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగింత

రిజర్వాయర్ పనులు చేపట్టిన పిజెఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఇప్పటివరకు 78.36 శాతం మేర పనులు పూర్తి చేసి వైదొలగింది. మిగిలిన 21.64 శాతం పనులు చేసేందుకు కొత్త నిర్మాణ సంస్థకు పనులు పనులు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు మిగిలిన పనులకు కొత్త రేట్లకు అనుగుణంగా అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం వాటికి ఆమోదం తెలిపి రూ.26.90 కోట్లను మంజూరు చేస్తూ 2022 ఏప్రిల్ 25వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. స్టేజ్-2లో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన బిఎన్‌బి ఇన్‌ఫ్రా ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ రూ.23.83 కోట్లతో టెండర్లను దక్కించుకుంది.

కాంట్రాక్టర్ పేచీ

రైతుల నుంచి తీసుకున్న భూములకు రూ.2.25 కోట్లను చెల్లించకపోవడంతో కాలువ తవ్వకాలు ఆగిపోయాయి. పొందూరు మండలం వి.ఆర్ గూడెం, ధర్మపురం, వావిలపల్లిపేట, ప్రాంతాల్లో కాలువ తవ్వకాలకు ప్రభుత్వం రైతుల నుంచి భూమి తీసుకుంది వారికి డబ్బులు ఇవ్వకపోవడంతో కాలువ తవ్వకాలకు ససేమిరా అంటున్నారు. దీనినే అవకాశంగా తీసుకున్న సంబంధిత కాంట్రాక్టర్ అక్కడే పనులు చేస్తానంటూ పేచీలు పెడుతున్నట్లు తెలిసింది. కాంక్రీట్ పనులు చేసేందుకు అవకాశమున్నా తొలుత కాలువ తవ్వకాలే చేస్తానంటూ చెప్తున్నట్లు తెలుస్తోంది.

మరోసారి గడువు పెంపు

మడ్డువలస పనులు చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్ నిరాసక్తత కనబరుస్తున్నట్లు తెలిసింది. బిల్లులు చెల్లించకపోవడంతో రకరకాల సాకులతో పనులు ఆపేసినట్లు తెలుస్తోంది. పది కిలోమీటర్ల మేర కాలువ తవ్వాల్సి ఉండగా నాలుగు కిలోమీటర్లు తవ్వారు. కాలువపై 250 స్ట్రక్చర్లు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు ఒక్కటీ నిర్మించలేదు. కొత్తగా పనులు మొదలైన తర్వాత ఐదు శాతం మాత్రమే పూర్తయ్యాయి. పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో ప్రభుత్వం మరోసారి వచ్చే ఏడాది మార్చి వరకు పొడిగించింది.



సోంపేట : మాట్లాడుతున్న ప్రసాద్

117 జిఓ రద్దు చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ప్రజాశక్తి- సోంపేట

117 రద్దు చేసి ఐదో తరగతి వరకు మాతృభాషలో విద్య ఉంచాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని బారువులో ఉన్న వి కన్వెన్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ముందుగా యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహిస్తున్నామని, ఈ సభల్లో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడడం, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం పలు అంశాలపై తీర్మానాలు, చర్చలు ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం పదో తరగతి విద్యార్థులకు మారిన టెస్టు పుస్తకాల్లోని కంటెంట్, పాఠాలు భవిష్యత్‌లో విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగపడే విధంగా లేవని అన్నారు. దీనివల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా పాత పాఠ్యాంశాలను తిరిగి చేర్చాలని, పిల్లల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేలా ఉండాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఆనాలోచిత, ఏకపక్ష విధానాలు ఒక కారణం కాగా, ఇప్పుడు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వెంటనే స్పందించి జిఓ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యను కాపాడుకోవడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు, ఆర్.మోహనరావు, చౌదరి రవీంద్ర, వాగ్దేవి, జానకిరామయ్య, బి.మోహనరావు, బమ్మిడి శ్రీరాములు, నాలుగు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ పతాకావిష్కరణ

నరసన్నపేట : ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఉపాధ్యాయులు కృషి చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్షులు టి.సుధీర్‌కుమార్ అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు సందర్భంగా స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో పతాకాన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజాపు దమయంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవాధ్యక్షులు కోరాడ వైకుంఠ యుటిఎఫ్ ఆవిర్భవ దినం నుంచి ఇప్పటి వరకు సాధించిన విజయాలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పోరాటాలను వివరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కె.ఆదినారాయణ, ఆర్.శ్రీనివాసరావు, ఎన్.అప్పలనాయుడు, డి.లక్ష్మణరావు, తిరుమలరావు, రాజరత్నం, బాబూరావు, మన్మథరావు, వేణు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

క్రీడల ఖిల్లా సిక్కోలు జిల్లా

- వెయిట్ లిఫ్టింగ్‌లో గుర్తింపు తీసుకురావాలి
- ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం: సిక్కోలు జిల్లా క్రీడల ఖిల్లా అని, జిల్లా నుంచి ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారని ఎమ్మెల్యే గొండు శంకర్ గుర్తుచేశారు. శ్రీకాకుళం రూరల్ మండలం మునసబుపేటలోని గాయత్రి కళాశాలలో జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఉండే ప్రత్యేకతే వేరని చెప్పారు. వీటి సాధన కూడా అంతే వైవిధ్యభరితంగా ఉంటుందన్నారు. వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు గాయాలపాలవుతుంటారని, కోచ్‌ల పర్యవేక్షణలో వారి సూచనలు పాటిస్తూ ఆటను ముందుకు సాగించాలన్నారు. జిల్లాకు చెందిన కరణం మల్లేశ్వరి, నీలంశెట్టి లక్ష్మి వంటి క్రీడాకారులు జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ, జాతీయస్థాయిలో చాటారని చెప్పారు. కరణం మల్లేశ్వరి ఒలింపిక్స్‌లో పతకం సాధించడం ద్వారా దేశంలోనే జిల్లా పేరు మార్మోగిందన్నారు. క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసానిచ్చారు. జిల్లాస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయస్థాయి క్రీడాకారిణి నీలంశెట్టి లక్ష్మి, టిడిపి నాయకులు కలగ జగదీష్, గాయత్రి విద్యాసంస్థల అధినేత స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా

సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా రెపరెపలాడాలని సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు అన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించాలన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక గాంధీ మందిరంలో ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహంతో పాటు రవీంద్రనాథ్ ఠాగూర్, బాలగంగాధర్ తిలక్, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, పింగళి వెంకయ్య, బంకిచంద్ర చటోపాధ్యాయ, లాల్‌బహుదూర్ శాస్త్రి, భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమ పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతిఒక్కరిలోనూ జాతీయతా భావం, ఐకమత్యం, జాతీయ సమగ్రత పెంపొందాలన్నారు. కార్యక్రమంలో నాబార్డు డిజిఎం రమేష్ కృష్ణ, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధి నటుకుల మోహన్, ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహానికి పూలమాలు వేస్తున్న ప్రసాదరావు



విరాళాన్ని అందజేస్తున్న శ్యామ్‌క్రగ్ కార్మికులు

వయనాడ్ బాధితులకు విరాళం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

కేరళలోని వయనాడ్‌లో ప్రకృతి విలయానికి గురైన వరద బాధితుల కోసం శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్మికులు రూ.12,080 విరాళంగా అందజేశారని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎన్.వి రమణ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయనాడ్‌లో వరదల వల్ల సర్వం కోల్పోయిన వారికి సహాయంగా సిఐటియు కేంద్ర కమిటీ పిలుపు మేరకు విరాళాలు వసూలు చేసి రాష్ట్ర కమిటీ ద్వారా పంపించనున్నట్లు తెలిపారు. వయనాడ్ విపత్తులను కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి వరద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు ఆర్థిక సహాయం చేసిన కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మీసాల సురేష్, ఎం.గౌరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడలో గల తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కోసం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పనుల పూర్తికి చర్యలు చేపడతానన్నారు. ఇప్పటికే వీటన్నింటిపై అధికారులతో సమీక్షిస్తున్నానని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తన వద్దకు గుంపులుగా వచ్చి గంటల సమయం వృథా చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో సమస్యలు ఏవైనా ఉంటే వాటిని తన దృష్టికి తీసుకురావాలనుకుంటే ఒకరిద్దరు నాయకులు వస్తే సరిపోతుందన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నాయో తనకు తెలుసునని, ఎన్నికల ప్రచారంలో గ్రామాలకు వచ్చి అన్ని సమస్యలను తెలుసుకున్నానని చెప్పారు. ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలను ఒకొక్కటిగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, నాయకులు తంగుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

కరువు జిల్లా హామీ కలేనా..?

ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే రైతు గుండెల్లో దడ మొదలవుతుంది. సకాలంలో వర్షాలు కురవక పూర్తిస్థాయిలో సాగునీరు అందక రైతులు వ్యవసాయం చేయాలా? వద్దా? అనే సందిగ్ధంలో పడుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మాత్రం ఎరువులు, విత్తనాలు సకాలంలో అందిస్తున్నాం... రైతులకు అండగా ఉంటామని ఎన్నికల సమయంలో హామీలు గుప్పిస్తుంటారు. కానీ, అమలకు నోచుకోవడం లేదని వాదన రైతుల నుంచి వినిపిస్తోంది.


- వర్షాభావ పరిస్థితులతో గతేడాది 18 వేల ఎకరాల్లో తగ్గిన వరి సాగు
- అధికారంలోకి వస్తే కరువు జిల్లాగా ప్రకటిస్తామని అచ్చెన్నాయుడు హామీ

ప్రజాశక్తి- పలాస

జిల్లాలో గతేడాది వర్షపాతం కన్నా 6,132 మిల్లీ మీటర్ల నమోదు కాగా, 2022 ఏడాది కన్నా... గతేడాదిలో సుమారు 18 వేలు ఎకరాల్లో వరి సాగు తగ్గిదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అటువంటి పరిస్థితే గతేడాది జిల్లాలో చోటు చేసుకుంది. దీని ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఎపి రైతు సంఘాలతో పాటు ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వ కార్యాలయాలు వద్ద నిరసనలు, ధర్నాలు చేపట్టారు. అయితే అప్పటి వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. అదే సమయంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రస్తుత వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాను కరువు జిల్లాగా ప్రకటిస్తామని హామీఇచ్చారు. అధికారం చేపట్టి అరవై రోజులు గడుస్తున్నా కరువు జిల్లా ఊసే ఎత్తకపోవడంపై టిడిపి ప్రభుత్వంపై రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గతేడాది సాగు వివరాలు

జిల్లాలో 2022లో సుమారు 3,77,355 ఎకరాల్లో వరి సాగు చేయగా, 2023లో 18 వేలు ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. గతేడాది వాస్తవానికి 3,98,750 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా, 3,59,350 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో కంచిలి మండలంలో 11,377 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా, 5,762 ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు 50 శాతం మాత్రమే వరి సాగైంది. గార మండలంలో 18,252 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా, 15,605 ఎకరాలు, శ్రీకాకుళంలో 18,177 ఎకరాలు గానూ, 15,357 ఎకరాలు, పాతపట్నంలో 17,762 ఎకరాలు గానూ, 15,300 ఎకరాలు, పొందురూలో 8557 ఎకరాలు గానూ, 7032 ఎకరాలు, సంతబొమ్మాళిలో 19,865 ఎకరాలు గానూ, 17,862 ఎకరాలు, కోటబొమ్మాళిలో 17,715 ఎకరాలు గానూ, 16,182 ఎకరాలు, ఇచ్ఛాపురంలో 8,627 ఎకరాలు గానూ, 7537 ఎకరాలు, కవిటిలో 3555 ఎకరాలు గానూ, 2670 ఎకరాలు, పోలాకిలో 20,177 ఎకరాలు గానూ, 17,952 ఎకరాలు, పలాసలో 11500 ఎకరాలు గానూ, 10,237 ఎకరాలు, మోళియాపుట్టిలో 18,225 ఎకరాలు గానూ, 15,675 ఎకరాలు, టెక్కలిలో 17,830 ఎకరాలు గానూ, 16,425 ఎకరాలు, ఎల్ఎన్‌పేటలో 10,935 ఎకరాలు గానూ, 9,950 ఎకరాలు, సోంపేటలో 10,097 ఎకరాలు గానూ, 8,302 ఎకరాలు, సారవకోటలో 16,467 ఎకరాలు గానూ, 15,592 ఎకరాలు, జలుమూరులో 21,017 ఎకరాలు గానూ, 19,265 ఎకరాలు, నరసన్నపేటలో 19,347 ఎకరాలు గానూ, 16,712 ఎకరాలు ఇలా జిల్లా వ్యాప్తంగా సుమారు గతేడాది 18 వేలు ఖరీఫ్ సాగు తగ్గిందని వ్యవసాయ శాఖ అధికారులు లెక్కలు చెబుతున్నాయి.



కవిటి మండలంలో ఆకుమడిలో పశువులను మేతకు వదిలిన రైతులు (ఫైల్)

గతేడాది తగ్గిన వర్షపాతం

జిల్లాలో గతేడాది 34,987 మిల్లీమీటర్లు వర్షపాతం అవసరం కాగా, 28,855 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

జిల్లావ్యాప్తంగా 6,132 మిల్లీమీటర్లు తక్కువగా వర్షపాతం నమోదైంది. జిల్లాలో కంచిలి 608, ఇచ్ఛాపురం 590, కవిటి 629, సోంపేట 567, నందిగాం 483, వజ్రపుకొత్తూరు 395, టెక్కలి 477, పోలాకి 450, సారవకోట 376, మందస 336, పలాస 212, జి.సిగడాం 330, ఇలా 18 మండలాల్లో నమోదు కావాల్సిన వర్షపాతం కన్నా తక్కువ నమోదైంది. దీంతో చాలా మండలాల్లో ఉబాలకు నోచుకోలేదు. సోంపేట, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి మండలాల్లో గతేడాది నాట్లే వేయలేని పరిస్థితి ఏర్పడింది.

పట్టించుకోని గత ప్రభుత్వం

జిల్లా వ్యాప్తంగా గతేడాది కరువు ఛాయలు కనిపించినా అప్పటి వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. జిల్లాలో వర్షపాతం తక్కువ నమోదు కాగా, సాగు శాతం గణనీయంగా తగ్గిపోయింది. గతేడాది కొన్నిప్రాంతాల్లో నవంబరు నెల సమీపించినా నాట్లు వేయలేని పరిస్థితి. వర్షం కోసం పైకి చూడగా సాగునీరు కోసం వంశధార, ఇరిగేషన్ ప్రాజెక్టుల కాలువల వైపు చూడాల్సిన పరిస్థితి. అప్పటికే జిల్లాలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, స్పీకర్ తమ్మినేని సీతారాం ఉన్నా పట్టించుకోలేదు. జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఎపి రైతు సంఘం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు అప్పట్లో ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు, నిరసనలు చేపట్టారు. అధికారులకు వినతి పత్రాలు కూడా సమర్పించినా ఫలితం లేకపోయింది. జిల్లా పరిస్థితులను అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. అదే సమయంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టిడిపి తమ పార్టీ బలోపేతం కోసం చేపడుతున్న సమావేశాల్లో అప్పటి టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రస్తుత వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాను కరువు జిల్లాగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. దీంతో చంద్రబాబు నాయుడు, అచ్చెన్నాయుడు ఎప్పుడూ ప్రకటిస్తారని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

కరువు జిల్లాగా ప్రకటిస్తే...

జిల్లాలో ప్రధాన పంట వరి, జీడి, కొబ్బరి, ఇతర ఆరుతడి పంటలు వేరు. శెనగ, పెసర, మినుము, చోడి, నువ్వు తదితర పంటలు విస్తీర్ణం, సాగును పరిశీలిస్తూ... వర్షాభావ పరిస్థితులు, సాగునీటి వనరులను జిల్లా ప్రాతిపదికన పరిశీలించి కరువు జిల్లాగా ప్రకటిస్తారు. గతేడాది టిడిపి ఇచ్చిన హామీను ప్రభుత్వం ప్రకటిస్తే... ముందుగా జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. రుణాలను రీ షెడ్యూల్ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలి. ఉపాధి హామీ పని దినాలు పెంచాలి. కరువు ప్రాంతాలకు అధిక నిధులు కేటాయించి సాగునీటి వనరులను అభివృద్ధి చేయాలి. రెండో పంటకు కావలసిన విత్తనాలు ఎరువులు ఉచితంగా పంపిణీ చేయాలి. అయితే టిడిపి కూటమి ప్రభుత్వం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుందో లేదో వేచిచూడాల్సిందే.

హామీని నిలబెట్టుకోవాలి



టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని వైసిపి ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఎన్నికల సమయంలో జిల్లాను కరువు జిల్లాగా ప్రకటిస్తామని ఇచ్చిన హామీని కచ్చితంగా నిలబెట్టుకోవాలి. రైతులకు అండగా ఉండి నష్టపరిహారం అందేలా చూడాలి.

- కె.మోహనరావు, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు

కొంక్యాన ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం


ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కొంక్యాన ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేణుగోపాలపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంక్యాన ట్రస్ట్ ఇప్పటికే నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఉచిత మెగా వైద్యశిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ లేప్రోస్కోపిక్ వైద్య నిపుణులు, మెడికవర్ డాక్టర్ శ్రీధర్, శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ శిష్టు మనోజ్‌కుమార్, స్త్రీ ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ కొంక్యాన మాధురి, ఎముకలు, కీళ్లవ్యాధి నిపుణులు దొంతం ఆదిత్య, డాక్టర్ కాళ్ల సంగీతవాణ్, వైద్య నిపుణులు దొంతం ప్రియాంక, సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ, ఎంపిటిసి గుండ భాస్కరరావు పాల్గొన్నారు.

పాఠశాలల సముదాయాలకు సిద్ధం

ప్రజాశక్తి- టెక్కలి

విద్యా సంవత్సరం ఆరంభమైన నేపథ్యంలో పాఠశాల సముదాయాలు నిర్వహణకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. విద్యా సంవత్సరం ఆరంభమై మూడు నెలలు కావస్తుండడంతో మరలా ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాల సముదాయాలు నిర్వహణకు షెడ్యూల్ జారీ చేసింది. విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాల మేరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుక అనంతరం నిర్వహించనున్నారు. ఈ నెల 16 నుంచి పాఠశాలల సముదాయాలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ వరుస సెలవులు కారణంగా పాఠశాల సముదాయాలు నిర్వహణ ఆలస్యం కానుంది. గత ప్రభుత్వం హయాంలో రెండు మండలాలకు ఒకటిగా నిర్వహించారు. ఈ ప్రభుత్వ హయాంలో అదే విధంగా నిర్వహిస్తారా లేక మండలం చొప్పున నిర్వహిస్తారా అన్నది స్పష్టత లేదు. ఏదిఏమైనా పాఠశాలల సముదాయాల నిర్వహణకు విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది.



ఎన్నికైన నాయకులు

కాష్యూ, రైస్‌మిల్లు లేబర్ యూనియన్ అధ్యక్షునిగా కృష్ణమూర్తి

ప్రజాశక్తి- పలాస

పలాస, కాశీబుగ్గ, మొగిలిపాడు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిధిలోని జీడి పరిశ్రమలు, రైస్ మిల్లర్ కార్మికులతో కూడిన కష్యూ, రైస్ మిల్లర్ లేబర్ యూనియన్ ప్రత్యేక సమావేశం ఆదివారం నిర్వహించారు. నూతన అధ్యక్షునిగా అంబటి కృష్ణమూర్తి, కార్యదర్శిగా సానా ఈశ్వరరావు, కోశాధికారిగా కోనారి రాములను ఎన్నుకున్నారు. రెండేళ్లకొకసారి జరిగే నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక జీడి కార్మికులకు, మేస్త్రీలకు, కళాసీలు, రోస్టింగ్, కాల్చువారు, ఆతుకువారు, కలుప్ మేస్త్రీలు, పప్పు ఒలిచే వారు, కటింగ్ చేసే వారు, రైస్ మిల్ కళాసీలు, డ్రైవర్లు, మహిళా కార్మికులు, రైస్ మిల్లర్ కార్మికులు సుమారు పది వేల మంది కార్మికుల సమక్షంలో సమావేశం నిర్వహించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న గోపీబాల

మెట్టవలసలో పారిశుధ్య పనులు

జి.సిగడాం: మండలం మెట్టవలసలో కలెక్టర్ ఆదేశాల మేరకు పారిశుధ్య పనులను డివిజనల్ పంచాయతీ అధికారి గోపీబాల పర్యవేక్షించారు. కాలువల్లో చెత్తచెదారాలను తొలగించి, రోడ్లను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులను చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈయనతో పాటు పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు, సర్పంచ్ కామేశ్వరి సీతారాం, ఎంపిటిసి బెవర జగన్నాథం, వైద్యాధికారులు డాక్టర్ యశ్వంత్, సిహెచ్‌ఒ శివప్రసాద్, మండల వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి

పాతపట్నం: నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని బిజెపి నాయకుడు సిరిపురం తేజేశ్వరరావు కోరారు. అమెరికా, బెంగళూరుల్లో కార్పొరేట్ సంస్థలు నెలకొల్పి ఉదారతకు మారుపేరుగా నిలిచిన తెలుగు తేజం, ఇండో మిమ్ సంస్థ ఛైర్మన్ కృష్ణచైతన్యను ఆదివారం కలిశారు. బాపట్లకు చెందిన కృష్ణ ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డారు. కృష్ణ చదువుకున్న మద్రాస్ ఐఐటికి రూ.228 కోట్ల విరాళాన్ని ఇటీవల అందించారు. ఈ నేపథ్యంలో తేజేశ్వరరావు ఆయనను కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

నాటుసారా నియంత్రణకు చర్యలు

మందస: నాటుసారాకు బానిసలుగా ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకోవద్దని సోంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ హితవు పలికారు. మండలంలోని కొండలోగాం పంచాయతీ రామరాయిలో నాటుసారా నియంత్రణపై ఆదివారం అవగాహన కల్పించారు. నాటుసారా తాగడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయో వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటుసారా వద్దు... ఆరోగ్యమే ముద్దు అని అనుకున్నప్పుడే వారి కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉంటారని అన్నారు. యువత, మహిళా సంఘాలు నాటుసారా నియంత్రణకు సహకరించాలని కోరారు. ఎవరైనా నాటుసారా తయారీ, అమ్మకాలు, రవాణా చేస్తే 9440902358 సెల్ నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు.

లష్కర్ల సమస్యలు పరిష్కరించాలి

పోలాకి: వంశధారశాఖ ద్వారా కాలువలు బాగు చేయడానికి తాత్కాలికంగా పనిచేస్తున్న వారు లస్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. మండలంలోని కత్తిరివానిపేటలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాదికి నాలుగు నెలలు మాత్రమే పని కల్పిస్తున్నారని అన్నారు. రోజుకు కూలి రూ.350 చొప్పున చెల్లిస్తున్నారని వివరించారు. అవి చాలా వరకు బకాయిలు ఉన్నాయని అన్నారు. వంశధార శాఖ అధికారులు ఉదాసీనతతో బిల్లు రాలేదని, వస్తే ఇస్తామని చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఏడాది పాటు పని కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానన్నారు. లస్కర్ల సరేశ్వరరావు, అప్పన్న, కామేశ్వరరావు, జనార్దనరావు పాల్గొన్నారు.

శ్రమదానంతో గ్రోయిన్ మరమ్మతులు

ఇచ్ఛాపురం: మండలంలోని బాహుదా నదిపై ఉన్న కేశుపురం గ్రోయిన్ మరమ్మతు పనులను ఆయకట్టు రైతులు చందాలు వేసుకొని ఆదివారం శ్రమదానం చేసి మరమ్మతులు చేపట్టారు. తిత్లీ తుపాను సమయంలో కొట్టుకుపోవడంతో అప్పటి నుంచి పంట పొలాలకు సాగునీరు అందలేదు. మరమ్మతులకు ఆయా గ్రామాల రైతులంతా కలిసి చందాల రూపంలో సొంతంగా రూ.2 లక్షల నిధులు సమకూర్చి తాత్కాలిక పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకి వరదనీటి వల్ల మరో గ్రోయిన్ మరమ్మతులకు గురైంది. దీంతో మళ్లీ రైతులంతా కలిసి రూ.50 వేలు చందాలు వేసుకొని ఇసుక బస్తాలతో మరమ్మతులు చేసి ట్రాక్టర్ సాయంతో మట్టిని వేసి తాత్కాలిక మరమ్మతులు చేశారు. ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వ హయాంలోనైనా శాశ్వత పరిష్కారం లభిస్తుందని వారంతా ఎదురు చూస్తున్నారు. కార్యక్రమంలో నాయుడు, ఆనంద, గురుమూర్తి, దున్న లోకనాథం పాల్గొన్నారు.

రైతుల గోడు పట్టదా..?

- అందని సాగునీరు
- ఏటా తప్పని నష్టాలు
- పూర్తిస్థాయిలో మరమ్మతుకు నోచుకోని రిజర్వాయర్లు, ఓపెన్ హెడ్ చానళ్లు
- నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

రైతే దేశానికి వెన్నెముకని ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వాలు ఆ రైతన్నల వెన్ను విరుస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు అందుతుందని ఎంతో ఆశతో వ్యవసాయానికి సిద్ధమవుతున్న రైతులు చివరకు సాగు నీరు అందక పంటలు నష్టపోయిన పరిస్థితి దాపురిస్తుంది. దీంతో నష్టాలు ఊబిలో రైతులు కూరుకుపోతున్నారు.



ఆయిల్ ఇంజన్‌తో పంటకు నీటిని పెడుతున్న రైతులు

ప్రజాశక్తి- బూర్జ

జులై మొదటి వారంలో కురిసిన వర్షాలకు ఎంతో సంబరపడ్డ రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. ఒకవైపు నూతన ప్రభుత్వం శివారు భూములకు కూడా ఇకపై సాగునీరు పుష్కలంగా అందజేస్తామని హామీలు గుప్పించడంతో పాటు మరోవైపు విస్తారంగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని రైతులు వ్యవసాయ పనులు మొదలు పెట్టారు. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లో 80 శాతం వరకు ఉబాలు పూర్తి చేసుకున్నారు.

ముఖం చాటేసిన వరుణుడు

ప్రస్తుతం ఊబాలు పూర్తి చేసుకున్న పొలాల్లో సాగునీరు అందక వరినాట్లు ఎండిపోయిన పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు గత 15 రోజులుగా వరుణుడు ముఖం చాటేశాడు. వర్షాలు పూర్తిగా లేకపోవడంతో వరినాట్లు ఎండిపోవడం కాకుండా భూములు బీడు భూములుగా మారిపోయిన పరిస్థితి కనిపిస్తుందని రైతులు తెలిపారు. ముఖ్యంగా ఓనిగడ్డ ఆనకట్ట ద్వారా సాగునీరు అందించేందుకు అధికారులు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటా మని హామీలు గుప్పించినప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని రైతులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. దీనికి సంబంధించి షట్టర్లు బిగించామని చెబుతున్న అధికారులు సాగునీరు అందించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనివలన సాగునీరు అందక హరిపురం, పల్లాపురం, డొంకలపర్త, తుడ్డలి, పాలవలస, లక్కుపురం, పెద్దపేట తదితర గ్రామాల్లో సాగునీరు అందక పోవడంతో రైతులు ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. మరోవైపు నాగావళి ఓపెన్ హెడ్ ఛానల్స్ తొమ్మిది ఉండగా వాటిలో పూడికలు, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు అధికారులు చేపట్టక పోవడంతో కాలువల ద్వారా సాగునీరు అందడం లేదని రైతుల పేర్కొన్నారు. వైపర్ల, పనుకుపర్త, కిలంతరి, అల్లెన, బూర్జ, వావాం, లాభాం, నీలాదేవిపురం తదితర గ్రామాల్లో భూములు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. బొమ్మిక రిజర్వాయర్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో జగన్నాధపురం, మదనాపురం, బొమ్మిక, అప్పలపేట, కురుంపేట, రాజుపేట గ్రామాల్లోని పొలాలు బీడు భూములను తలపిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జంగిల్‌తో నాగావళి ఓపెన్‌హెడ్ ఛానల్ కాలువ

ఎట్టకేలకు మరమ్మతులు

గత రెండు రోజుల క్రితం ఓనిగడ్డ ఆనకట్టకు మరమ్మతులు చేపట్టారు. అయినప్పటికీ సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడం వలనే సాగునీరు అందడం లేదని రైతులు పేర్కొన్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

రైతులకు అవసరమైన సాగునీరు అందించడంలో అధికారులు చోద్యం చూస్తున్నారని వారి నిర్లక్ష్య వైఖరి కారణంగా తాము ప్రతి ఏడాది నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి దాపురిస్తుందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఆదిలోనే సాగునీరు అందకపోతే తాము వ్యవసాయం ఎలా చేయాలని ప్రశ్నిస్తున్నారు. రైతులంటే ఇంత చిన్నచూపు తగదని పేర్కొన్నారు. సాగునీరు అందిస్తామని ప్రకటనలు గుప్పిస్తున్న ప్రజాప్రతినిధులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని రైతుల పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వ్యవసాయానికి అవసరమైన సాగునీటిని అందించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

రైతుల నడ్డి విరుస్తున్నారు



అధికారులు, ప్రజాప్రతినిధులు రైతుల నడ్డి విరుస్తున్నారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నారు. కనీసం సాగునీరు కూడా ఇంతవరకు అందడం లేదు. రైతుల పట్ల చిన్నచూపు తగదు.

- దాలినాయుడు, రైతు

సాగునీరు ఇవ్వాలి



ఒకవైపు వర్షాలు లేవు. మరోవైపు సాగునీరు అందడం లేదు. అన్ని విధాలుగా నష్టపోయాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వ్యవసాయానికి అవసరమైన సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

- పాపారావు, రైతు, లక్కుపురం

ఎమ్మెల్సీ హరిప్రసాద్‌తో భేటీ

ఆమదాలవలస: ఇటీవల జనసేన ఎమ్మెల్సీగా ఎన్నికైన పిడుగు హరిప్రసాద్‌ను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆదివారం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువతో సత్కరించి సూర్యనారాయణ స్వామి చిత్రపటాన్ని బహుకరించారు. అనంతరం నియోజకవర్గంలోని రాజకీయ అంశాలపై చర్చించారు.



అవార్డు అందుకుంటున్న అరుణకుమారి

'సర్వేపల్లి' అవార్డు అందజేత

ప్రజాశక్తి- జి.సిగడాం

విశాఖపట్టణం శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేషనల్ ఫామ్ ఫర్ సోషల్ జెసిటిస్ న్యూ ఢిల్లీ సిఇఒ గురుదేవ్ చేతులమీదగా కుర్మాన అరుణకుమారి సేవలకు గుర్తింపుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణ అవార్డును ప్రధానం చేశారు. విద్యారంగంలో తనదైన విధానంలో పిల్లలకు అందరినీ ఆకట్టుకునే విధానంగా బోధిస్తున్నందుకు ఈ అవార్డు కైవసం చేసుకున్నారు. అరుణకుమారి మండలంలో ఒక మారుమూల ప్రాంతమైన అద్వానంపేటలో మండల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఇంత గొప్ప అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు.

ప్రిన్సిపల్ సెక్రటరీ అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామిని ఆదివారం న్యూఢిల్లీ రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వై.వి.జె. రాజశేఖర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఘనంగా స్వాగతం పలికారు. వేద మంత్రాలతో ఆశీర్వదించి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి, ఇఒ ఎస్.చంద్రశేఖర్ ఉన్నారు.

అపూర్వ కలయిక

నందిగాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986-91లో చదువుకున్న విద్యార్థులు ఆదివారం హైస్కూల్ ప్రాంగణంలో కలుసుకున్నారు. దీంతో గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు కె.రామకృష్ణ, ఈశ్వరరావు, పి.కృష్ణారావుశర్మలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పి.ఢిల్లేశ్వరరావు, కె.యాదవ్, సిహెచ్.జోగారావు, ఎన్.శ్యామల, ప్రభాకరరావు పాల్గొన్నారు.

పోలారావురెడ్డి సేవలు మరువలేనివి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ పిలక పోలారావురెడ్డి చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఆదివారం పోలారావురెడ్డి జయంతి సందర్భంగా మండలంలోని బెల్లుపడ-అచ్చంపేట కూడలి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, పిలక సంతోష్, ఆసీ సత్య, ఎంపిపి బోర పుష్ప, సెల్ల సుగుణ, తాడి ఆదిరెడ్డి, బచ్చు జగన్, పిలల యాదవరెడ్డి, పిలక విజయ్, అణపాన పీతాంబరరెడ్డి, ప్రకాశరావు పట్నాయక్, రాంజీ, పి.కోటి పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ శిల్పంపై జరిగిన దాడిని ఖండిస్తూ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

అన్న క్యాంటీన్‌కు ఆర్థికసాయం

కోటబొమ్మాళి: ప్రతి పేదవాడూ ఆకలితో ఉండకూడదని ఉద్దేశంతో ప్రభుత్వం మండల కేంద్రంలో ఈనెల 15 నుంచి అన్న క్యాంటీలను ప్రారంభిస్తుంది. అన్న క్యాంటీన్‌కు నందిగాం మండలం ఆనందపురం పంచాయతీ మాదిగపురానికి చెందిన హోమియో మెడికల్ విశ్రాంత అధికారి రోణంకి ఆనందరావు విరాళాన్ని ప్రకటించారు. మండలంలోని నిమ్మాడలో ఉన్న మంత్రి క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఆదివారం కలిసి రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్న క్యాంటీన్ నిర్వహణకు దాతలు ముందుకురావాలని కోరారు. అలాగే జిల్లా నలుమూలల నుంచి టిడిపి నాయకులు, అభిమానులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలు వివరించారు.

ఉన్నత లక్ష్యాల వైపు పయనించాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ తరువాత సమయం కీలకమైనదని ఈ సమయంలో తీసుకున్న మంచి నిర్ణయం ఉన్నత లక్ష్యాల వైపు తీసుకువెళ్తుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఎన్ఇఆర్ స్కూల్ అఫ్ ఎక్సలెన్స్‌లో ఎమ్మెల్యే ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ ల్యాబ్ పరిశ్రమ కోసం ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఎస్ఎంటి ఉద్యోగాలకు ఆదివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకాశాలు ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లాలని సూచించారు. ఇప్పుడు చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి దొరుకుతుందన్నారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్ ప్లేస్‌మెంట్ ఇన్‌ఛార్జి విజయకృష్ణ మాట్లాడుతూ నెలరోజుల క్రితం నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన 40 మంది విద్యార్థులు హైదరాబాద్‌లో జాయిన్ అవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జనసేన ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి విశ్వక్సేన్, టిడిపి సీనియర్ నాయకులు జగన్నాథం నాయుడు, రౌతు శ్రీనివాసరావు, ముప్పిడి సురేష్, వడ్డాది శ్రీనివాసరావు, కొమరాపు రవి, పాత్రో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

అంబేద్కర్ ఆదర్శప్రాయుడు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆదర్శ ప్రాయుడని ఎమ్మెల్యే ఈశ్వరరావు అన్నారు. మండలంలోని తిరుపతిపాలెంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనా విధానం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. న్యాయవాదిగా, ఆర్థికశాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘ సంస్కర్తగా విభిన్న పాత్రలు పోషించిన మహా నాయకుడు అన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి విశ్వక్సేన్, సర్పంచ్ ఆకుల రవికుమార్, మాజీ సర్పంచ్ మండల రాము నాయుడు, పిసిని జగన్నాథం నాయుడు, రౌతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యంతో పాటు లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి గంట్యాడ ఏసుబాబు అన్నారు. మండలం లంకపేటలో ఎన్‌పిఎం షాప్ ఆదివారం ఓపెనింగ్ చేశారు. ఇందులో భాగంగా సామూహికంగా నియమాస్త్రం తయారు చేయడంపై రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. నియమాస్త్రం ట్యాంక్‌లో ఇరవై లెటర్లు చొప్పున వేసుకొని ఎటువంటి నీళ్లు కలపకుండా వరి పొలంలోగాని, ఇతర పంటలకైనా వేసుకుంటే రసం పీల్చే పురుగు, చిన్న పురుగులు ఉధృతను కాపాడు తుందన్నారు. ఐసిఆర్ పి.సూర్యం, ఐబి వలంటీర్ సత్యవతి, రైతులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ఎన్‌పిఎం షాప్ దినోత్సవం సందర్భంగా యూనిట్ ఇన్‌ఛార్జి సన్యాసిరావు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, దశపర్ని కషాయాలను రైతులందరితో తయారు చేయించారు. సర్పంచ్ టి.లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ మెండ రాజారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మీనా, తులసి సత్యవతి, ధనుంజయ్, హరే రామ్, రైతులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల : కషాయం తయారు చేస్తున్న రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఆమదాలవలస: ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి మండలంలోని కొరపాం, నిమ్మతొర్లాడ, కొత్తవలస గ్రామాల్లో దశపర్ని, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, జిల్లేడు కషాయాలను రైతులతో తయారు చేయించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతి, లక్ష్మి, జానకిరామ్ పాల్గొన్నారు.

పాతపట్నం: కషాయాన్ని పంట దశకు ముందుగా తయారు చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని బడ్డుమరిలో రైతులకు కషాయం తయారీపై శిక్షణ ఇచ్చారు. బ్రహ్మాస్త్రాన్ని ఐదు జాతుల ఆకులతో తయారు చేయాలన్నారు. నంసింహ, భీమారావు, ప్రభావతి, మధుసూదన్ పాల్గొన్నారు.



ఆటలు ఆడుతున్న విద్యార్థులు


పాఠశాలల్లో క్రీడా సందడి

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా సందడి నెలకొంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాల్లో నిర్వహించే వేడుకల్లో భాగంగా క్రీడాపోటీలు నిర్వహిస్తుండడంతో సందడి వాతావరణం చోటు చేసుకుంది. విద్యాసంవత్సరం ఆరంభమైన కొద్ది నెలల్లోనే క్రీడాపోటీలు ప్రారంభం కావడంతో విద్యార్థుల్లో ఆనందాలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే పాఠశాలల్లో క్రీడాపోటీలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 8 వరకు పాఠశాలల్లో విద్యాకమిటీ ఎన్నికలతో క్రీడలపై దృష్టి పెట్టకపోవడం, గడచిన రెండు రోజులు సెలవులు కావడంతో క్రీడల నిర్వహణ ఆలస్యంగా మారుతున్న సమయంలో చాలా పాఠశాలల్లో సెలవుల రోజుల్లో కూడా క్రీడలు నిర్వహించడం గమనార్హం. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తున్న తరుణంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించే క్రీడలపై విద్యార్థులు, పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించడంతో పాఠశాలల్లో జరిగే క్రీడలపై విద్యార్థులు ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. ఏదిఏమైనా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో క్రీడాపోటీలతో సందడి వాతావరణం చోటు చేసుకుంటుంది.

అభివృద్ధిబాటలో రైల్వేస్టేషన్

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ అభివృద్ధి పథంలో నడిపిస్తామని స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు మెట్ట తిరుమలరావు, బొడ్డేపల్లి దివాకర్, కోత రమణ, ఉప్పాడ శ్యామలరావు, పందిరి వెంకటరావులు అన్నారు. రైల్వే స్టేషన్ మాస్టర్ డి.హేమలత, శ్రీకాకుళానికి చెందిన కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గణేష్‌తాపా నేతృత్వంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. స్టేషన్‌కు అవసరమైన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల్లో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సదుపాయం, ప్రయాణికులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాల కోసం ప్రణాళికలు రూపొందించి తీర్మానించారు. సంబంధిత నివేదికలను రైల్వే ఉన్నతాధికా రులను అందజేస్తామని తెలిపారు. కమిటీ సభ్యులకు సన్మానించారు.



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న రైల్వే అధికారులు

ఎస్‌సి వర్గీకరణను నిలుపుదల చేయాలి

కంచిలి: దళితుల ఐక్యతను విచ్ఛిన్నం చేసేలా ఉన్న ఎస్‌సి వర్గీకరణ తీర్పును ఉపసంహరించుకోవాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎస్‌సి ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. కంచిలి మార్కెట్ యార్డులో కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాలకు చెందిన దళిత నాయకులు ఐక్యవేదిక పేరిట ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు వల్ల దళితులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. దళితుల ఐక్యతకు దెబ్బతీసే ఈ తీర్పును ఉపసంహరించుకోవాలని కోరారు.అనంతరం కంచిలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఐక్యవేదిక అధ్యక్షుడు చల్ల దేవరాజు, గౌరవాధ్యక్షుడు నగిరి మోహనరావు, బి.రవి, బాబూరావు, తేజేశ్వరరావు, బి.గిరిధరరావు, పి.లోకేశ్వరరావు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ ఛైర్మన్‌కు మాతృ వియోగం

ప్రజాశక్తి- ఆమదాలవలస



విజయలక్ష్మి (ఫైల్)

మాజీ మున్సిపల్ ఛైర్మన్ తమ్మినేని గీత తల్లి జయలక్ష్మి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ జిల్లా జడ్జి బగాది కృష్ణారావు సతీమణి విజయలక్ష్మికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. టిడిపి సీనియర్ నాయకులు తమ్మినేని గీత, మరోకుమార్తె యుఎస్‌లో స్థిరపడ్డారు. కుమారుడు కళ్యాణ్ చక్రవర్తి ప్రస్తుతం విజయనగరం జిల్లా జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈమె అంత్యక్రియలు సోమవారం ఉదయం 9 గంటలకు నిర్వహించ నున్నట్లు రాష్ట్ర టిడిపి న్యాయ విభాగ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ తెలిపారు.



నిరసన తెలుపుతున్న వాణి

కొనసాగుతున్న వాణి నిరసన

టెక్కలి రూరల్ : వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఇంటి వద్ద ఆయన భార్య దువ్వాడ వాణి, ఆయన కుమార్తె హైందవి నిరసన ఆదివారం మూడు రోజూ కొనసాగిస్తున్నారు. టెక్కలి సిఐ పి.పైడయ్య ఆధ్వర్యాన ఎమ్మెల్సీ ఇంటి వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా ఇంటి ఆవరణలోనే నిద్రిస్తున్నారు. ఆమె తల్లిదండ్రులు సంపతరావు రాఘవరావు, తల్లి లక్ష్మి కుమార్తెకు మద్దతు తెలుపుతూ ధైర్యం చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- కవిటి

బొరివంక సబ్‌స్టేషన్ 33/11 కెవి ఫీడర్‌లో మరమ్మతులు కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మాణిక్యపురం, కుసుంపురం, బిజీ పుట్టుగ, బొరివంక, బల్లిపుట్టుక, ఇద్ది వానిపాలెం, బెజ్జిపుట్టుగ పంచాయతీల పరిధిలోని గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

సింగుపురం మీదుగా 'పల్లెవెలుగు'

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం బస్సు కాంప్లెక్స్ పరిధిలో ఆదివారం నుంచి నరసన్నపేట, టెక్కలి, పలాస, శ్రీముఖలింగం, తిమడాం, గోపాలపురం వైపు వెళ్లే పల్లె వెలుగు సర్వీసుల్లో కొన్ని సర్వీసులు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9.15 గంటల వరకు సింగుపురం గ్రామం మీదుగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని 2వ డిపో మేనేజర్ రవిశంకర్ తెలిపారు. సింగుపురం, పరిసర ప్రాంత ప్రయాణికులు ఈ పల్లె వెలుగు బస్సుల సౌకర్యాన్ని వినియోగించు కోవాలని కోరారు.

ఇచ్ఛాపురం ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా శంకర్

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడుగా బొండాడ శంకర్, కార్యదర్శిగా టెంకాల రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ఐపిఎం న్యూస్ కార్యాలయం నూతన కార్యవర్గం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. గౌరవ సలహాదారు కోట రామారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షునిగా సిక్కోలు టుడే విలేకరి బొండాడ శంకర్, వైస్ ప్రెసిడెంట్‌గా న్యూస్ ఫోకస్ రిపోర్టర్ దూపం రాజేష్, సెక్రటరీగా ఐపిఎం విలేకరి టెంకాల రాజేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన ప్రెసిడెంట్ శంకర్ మాట్లాడుతూ జెపిసి యూనియన్‌ను మరింత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గిలాయి శంకర్, శ్యాం, ఉప్పాడ మోహనరావు, జీవన్, శ్రీను, సునీల్ పాల్గొన్నారు.

వర్గీకరణ పోరాట సమితి కార్యవర్గం ఏర్పాటు

శ్రీకాకుళం అర్బన్: స్థానిక అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సమావేశం, కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. దళిత మహాసభ సీనియర్ దళిత నాయకులు బెంజిమెన్ సమావేశాన్ని ప్రారంభించి వర్గీకరణ వద్దు ఐక్యతే ముద్దు అనే నినాదాలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పును పున్ణ సమీక్షించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. కార్యక్రమంలో భాగంగా జిల్లా కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కన్వీనర్‌గా బోకర నారా యణ రావు, కో-కన్వీనర్‌గా జాన్, శ్యామ్ సుందరరావు, అప్పన్న, పి.సుధాకర్, గౌరవ అధ్యక్షులుగా నూతల పాటి భరత్ భూషణ్ రాజు, ముఖ్య సలహా దారులుగా పోతల దుర్గారావు, అంపోలు ప్రతాప్, బోనెల అప్పారావు కోశాధికారిగా లింగాల అప్పన్న, రమేష్, మీడియా కన్వీనర్‌గా గంజి ఎజ్రా తదితర సభ్యులను ఎన్నుకున్నారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పిలుపు మేరకు కార్యక్రమాలు నిర్వహించాలని సభ్యులకు కోరారు.



దుస్తులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఎమ్మెల్యే అశోక్ వివాహ వార్షికోత్సవం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందళం అశోక్ వివాహ వార్షికోత్సవ వేడుకలను టిడిపి నాయకులు కొండ శంకర్‌రెడ్డి ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద పేదలకు ఎమ్మెల్యే దుస్తులను పంపిణీ చేశారు. అలాగే కాంప్లెక్స్ ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, పత్రీ తవితయ్య, నందిగాం కోటేశ్వరరావు, జన్నేలా సంతోష్, అర్.జానకీరావు, జిలానీ, ఎస్.శేఖర్, సహదేవ్‌రెడ్డి, సుభాష్ రౌలో, ఉలాసీ ఎర్రయ్య పాల్గొన్నారు

ఎంఇఒ-1 బాధ్యతల స్వీకరణ

కోటబొమ్మాళి: ఎంఇఒ-1గా చందక గోవిందరావును ప్రభుత్వం ఇటీవల నియమించింది. దీంతో స్థానిక ఎంఆర్‌సిలో ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన కొత్తూరు మండల ఎంఇఒగా పనిచేస్తూ... ఇక్కడ ఇన్‌ఛార్జి ఎంఇఒగా బాధ్యతలను స్వీకరించారు. ఈయనకు ఎంఇఒ-2 ఎల్.వి.ప్రతాప్, యుటిఎఫ్ నాయకులు నాయకులు గొండు నారాయణరావు, ఉపాధ్యాయులు సనపల కరుణ్‌కుమార్‌లు దుశ్శాలువ కప్పి సన్మానించారు.